నిత్యం నరకప్రాయం...

- అడుగడుగునా ట్రాఫిక్ జామ్
- ప్రమాదాలకు అడ్డాగా పూల్‌బాగ్ రోడ్డు
- బెంబేలెత్తిపోతున్న పరిసర ప్రాంత వాసులు



పూల్‌బాగ్ వద్ద అవస్థలు పడుతూ వెళ్తున్న పాలిటెక్నికల్, పీజీ విద్యార్థులు

విజయనగరం టౌన్: ఊరి శివారున విసిరేసినట్లు ఉండే పూల్‌బాగ్ కాలనీ ఇప్పుడు బాగా ప్రాచుర్యం లోకి వచ్చింది. విజయనగరం – పాలకొండ రోడ్డులో ఉండే పూల్‌బాగ్ కాలనీ గేట్ వద్ద నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇరుకు రోడ్డు కావడం, విస్తరణ లేక పోవడం, ఉన్న రోడ్డుపై వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడం, కొనుగోలుదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపిఉంచడం వంటి కారణాలతో ప్రేమ సమాజం నుంచి పూల్‌బాగ్ గేట్ మీదుగా ఎంఆర్ పీజీ కళాశాల వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ రహదారిలోనే మిమ్స్ కళాశాల, అయ్యప్పనగర్‌లో ఏపీ మోడల్ స్కూల్, మహారాజా పీజీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, ఫార్మసీ కళాశాల, తదితర విద్యాసంస్థలున్నాయి. అటువైపు వెళ్లే విద్యార్థులు, మిమ్స్ కళాశాలకు అత్యవసర సేవలకై వెళ్లే రోగులు, ప్రమాద బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 8 వరకు పూల్‌బాగ్ కాలనీ గేట్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో రోడ్డు దాటడానికి విద్యార్థులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. పాలకొండ రహదారిని ఆనుకుని మంగళవీధి, పూల్‌బాగ్, మారుతీనగర్, అయ్యప్పనగర్, తదితర ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాలకు రాకపోకలు చేసే ప్రజలు, విద్యార్థులు, వృద్ధులకు ట్రాఫిక్ వల్ల ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా వ్యాపారస్తులను కట్టడి చేస్తే గానీ ట్రాఫిక్‌ను నియంత్రించలేమని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయమై స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నియంత్రించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందులెదుర్కొంటున్నాం..

నిత్యం నరకయాతన అనుభవిస్తున్నాం. రోడ్డు మీదకు వస్తే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనాల రాకపోకలు, విద్యార్థులతో నిత్యం పూల్‌బాగ్ కాలనీ కిటకిటలాడుతుంటుంది. ఇరుకు రోడ్లపైనే వ్యాపారస్తులు తమ వ్యాపారాలను కొనసాగించడం వల్ల రద్దీ పెరిగిపోయింది. సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి సమస్య పరిష్కరించాలి.

– చరణ్ కుమార్, లక్ష్మీ గణపతి కాలనీ, పూల్‌బాగ్ రోడ్డు, విజయనగరం

క్లుప్తంగా

పక్కాగా స్వమిత్వ సర్వే..



సీతారామునిపేటలో స్వమిత్వ సర్వేపై సూచనలిస్తున్న ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథ్

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో స్వమిత్వ సర్వే పక్కాగా నిర్వహించాలని ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథ్ సూచించారు. మండలంలోని సీతారామునిపేటలో సర్వే సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ కంఠంలో ఉన్న భూములు, ఇళ్లకు సంబంధించి వివరాలు సేకరించాలన్నారు. మ్యాప్ ద్వారా భూములు, ఇళ్లను గుర్తించి యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. గ్రామ కంఠంలోని భూములకు హక్కులు కల్పించడమే స్వమిత్వ సర్వే ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బంగార్రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ సదస్సు స్థానిక శంకరమఠం ఆవరణలో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు (తిరుపతి) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా హోటల్ మయూర అధినేత డాక్టర్ వై.బాబూరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సాహిత్యాభిమానులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి ..

- డిప్యూటీ డీఈఓ కేవీ రమణ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రమణ

నెల్లిమర్ల: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ కేవీ రమణ సూచించారు. నెల్లిమర్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ప్రధానోపాధ్యాయుడు ఆనందమూర్తిని ఆరా తీశారు. పరీక్షలకు ఏ మేరకు సన్నద్ధమైందీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ, చంద్రంపేట, ఎల్ఎన్ పురం, తుమ్మలపేట, చిన్న, పెద్ద బూరాడపేట, టెక్కలి, పారసాం, గెద్దపేట గ్రామాలతో పాటు గుర్ల మండలంలోని భూపాలపురం, ఆనందపురం, తాళ్లపూడిపేట గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రస్తావించండి

- ఎమ్మెల్యే కొణతాలకు వినతిపత్రం అందజేసిన భీశెట్టి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

విజయనగరం గంటస్తంభం: ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర శాసనసభలో మాట్లాడి ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కోరారు. ఈ మేరకు జిల్లాకు వచ్చిన కొణతాలను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలోని మహేంద్రతనయ, నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్టతో పాటుగా విజయనగరం జిల్లాలోని తోటపల్లి, జంఝావతి, వెంగళరాయ, రామతీర్థ సాగరం.. విశాఖపట్నం జిల్లాలోని రైవాడ జలాశయాల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్రలోని ప్రధాన కాలువల దుస్థితి చూసి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. చిన్నపాటి మరమ్మతులకు కూడా ప్రభుత్వం నిధుల విడుదల చెయ్యలేని పరిస్థితి నెలకొందన్నారు. 2025 – 26 వార్షిక బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయడం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయాలని కోరారు. ముందుగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ రాసిన 'పునాది స్థాయిలో విద్యా నైపుణ్యాలు పెంపొందించడం ఎలా' అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విడుదల చేశారు.

25వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన



బడ్డీలను తొలగించాలని సిబ్బందికి ఆదేశాలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం 25వ డివిజన్‌లో పర్యటించారు. రైల్వేస్టేషన్ వద్ద నున్న వసంత్‌విహార్ వద్ద ప్రారంభమైన పర్యటన గాడీఖానా, రైల్వేస్టేషన్ రోడ్, రంగాల వీధి, సంతపేట, తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. రైల్వేస్టేషన్ ప్రధాన రహదారులను ఆక్రమించి బడ్డీకొట్లు ఏర్పాటు చేయడం అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే రంగాలవీధిలో కాలువ నిర్మాణ పనులు చేపట్టాల్సిన ఉందన్నారు. వీధిదీపాలు వెలిగి ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో చేపడుతున్న క్రమబద్ధీకరణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని, డెబ్రిస్, ఇతర వ్యర్థాలు రోడ్లపై వేయరాదని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి, టీపీఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తున్న చిరువ్యాపారులకు కమిషనర్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ చాలామంది నేటికీ ఫుట్‌పాత్‌పైనే వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో వారిని మందలిస్తూ ఆయా ప్రాంతాలను ఖాళీ చేయించారు.

62 సంవత్సరాల వరకు కొనసాగించాలి..

విజయనగరం గంటస్తంభం: అరవై సంవత్సరాలు నిండాయనే కారణంలో విధుల నుంచి తొలగించిన 12 మందిని 62 సంవత్సరాల వరకు కొనసాగించాలని, లేనిపక్షంలో వారి కుటుంబం ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, ఎస్ఎంఆర్ కార్మికులు కోరారు. ఈమేరకు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ... అప్కాస్ విధానాన్ని రద్దు చేయడం తగదన్నారు. ఆప్కాస్‌లో నమోదైన వారు సుమారుగా లక్ష మంది ఉంటే అందులో దాదాపు 45 వేల మంది మున్సిపల్ కార్మికులే ఉన్నారని చెప్పారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అధికారాలు ఇస్తే కార్మికులకు అన్నీ కష్టాలేనని వాపోయారు. అప్కాస్‌ను కొనసాగించడంతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పార్వతమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



జాతరలో కిటకిటలాడుతున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగమాధవి , ఇతరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్లలో జరుగుతున్న పార్వతమ్మ జాతరకు రెండో రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. కొప్పెర్ల గ్రామానికి చెందిన అత్యధిక శాతం మంది విజయవాడలో నివాసం ఉండడంతో అక్కడ నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి జాతరలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూసపాటిరేగ ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం వైస్ సర్పంచ్ బాలా అప్పలరాజు జాతరకు వచ్చిన ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొప్పెర్ల సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు, ప్రజాప్రతినిధులు బావిశెట్టి నారాయణరావు, లంకలపల్లి రాజారావు, తదితరులు జాతర నిర్వహణకు సహకారం అందించారు. పార్వతమ్మ పేరంటాలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

విద్యుత్ సేవల్లో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి



విద్యుత్ వినియోగదారుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ

కొత్తవలస: విద్యుత్ సంబంధిత సేవల్లో వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఎదురైనా, సిబ్బంది పనితీరువల్ల అసౌకర్యం కలిగినా రాతపూర్వకంగా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)లో ఫిర్యాదు చేయాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం క్యాంపు కోర్టు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు లోఓల్టేజ్, విద్యుత్ స్తంభాల మార్పు, కొత్త కనెక్షన్ల ఏర్పాటులో జాప్యం, వ్యవసాయ మోటార్లకు కనెక్షన్లు ఇవ్వడంలో సిబ్బంది అలసత్వం, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయకపోవడం, విద్యుత్ బిల్లులు అధికంగా రావడం వంటి సమస్యలపై 27మంది ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల పై 60 రోజుల్లోగా పూర్తిస్థాయి విచారణ జరిపి తీర్పులను వెలువరిస్తామని విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ తెలిపారు.

వలంటీర్లపై రాజకీయ ముద్ర తగదు..

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్



విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

విజయనగరం గంటస్తంభం:

ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వం చెప్పిన పనులు చేయాల్సిన వలంటీర్లపై రాజకీయ ముద్ర తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. వలంటీర్ల సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పాలని కోరుతూ గురువారం స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కలిసి వినతి పత్రం అదజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి వలంటీర్లు రాజకీయాలకతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. కరోనా సమయంలో కూడా ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు రూ. 10 వేల గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.


మేధావుల చట్టసభకు రాజకీయ కళంకం

- కూటమి అభ్యర్థిని ప్రకటించడంపై మండిపడుతున్న టీచర్లు
- ప్రత్యర్థుల ప్రచారాలకు వెళ్తున్న టీచర్లపై కూటమి నిఘా

విజయనగరం అర్బన్: మేధావుల చట్టసభకు ఉపాధ్యాయుల ప్రాతినిధ్య ఎంపిక రాజకీయాలకు అతీతంగా జరగాల్సి ఉంది. ఇంతవరకు ఈ ఎన్నికల్లో రాజకీయ జోక్యం లేకుండా స్వతంత్ర అభ్యర్థులు పోటీలకు దిగేవారు. సభల్లో స్వతంత్ర అభ్యర్థులకు సమయం తక్కువ కేటాయిస్తారు కాబట్టి వాళ్లలో ఉద్యమ భావాలున్న వాళ్లంతా ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రెంట్ (పీడీఎఫ్) పేరుతో ఇంతవరకు తమ అభ్యర్థిత్వాన్ని ప్రకటించేవారు. అయితే ఈసారి జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీలలో కూటమి ప్రభుత్వం ఈ చారిత్రాత్మక నిబంధనలకు నీళ్లొదిలింది. ఏపీటీఎఫ్ (257) ఉపాధ్యాయ సంఘ అభ్యర్థిగా పోటీలో ఉన్న పాకలపాటి రఘువర్మను కూటమి అభ్యర్థిగా ప్రకటించింది. రఘువర్మ నామినేషన్ సమయంలో మద్దతుగా వెళ్లిన టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవులు అది తన వ్యక్తిమతమని చెప్పుకున్నారు. అలాగే పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ అభ్యర్థిగా నామినేషన్ వేసిన డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడుకు బీజేపీ మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మద్దతు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ నాయకుల జోక్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల ప్రచార గడువు ముగియనున్న సమయంలో ఇలా పాలకులు అభ్యర్థిని ప్రకటించడంపై ఉపాధ్యాయులు, మేధావులు భగ్గుమంటున్నారు. ఉపాధ్యాయ, అధ్యాపక ఓటర్లపై తీవ్ర ఒత్తిడి తేవడానికే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఏ రాజకీయ పార్టీ ఇలా అభ్యర్థిని ప్రకటించలేదని ఉపాధ్యాయవర్గాలు చెబుతున్నాయి. ప్రత్యర్థి ప్రచార కార్యక్రమాలకు వెళ్తున్న ఉపాధ్యాయులను గుర్తించడంపై కూటమి నాయకులు ఇప్పటికే ఆరా తీస్తున్నారు. గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల ప్రాంతాలో ప్రత్యర్థుల ప్రచారం గురువారం పాల్గొన్న ఉపాధ్యాయులకు అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి హెచ్చరికలు వెళ్లినట్లు సమాచారం.

కూటమి అభ్యర్థిని ప్రకటించడం సరికాదు

- ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు



పోస్టర్ విడుదల చేస్తున్న ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు

విజయనగరం అర్బన్: మేధావుల చట్టసభకు సంబంధించి పాలక పార్టీ అభ్యర్థిని ప్రకటించడం మేధావులను అవమాన పరిచినట్లేనని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల్లో గతంలో ఎప్పుడూ పాల్పడని విధంగా కూటమి ప్రభుత్వం అభ్యర్థిని ప్రకటించడం దురదృష్టకరమన్నారు. ఈ చర్య వల్ల ఎన్నికలు స్వేచ్ఛగా జరగవని చెప్పారు. ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అనంతరం ఎన్నికల హామీల పోస్టర్‌ను విడుదల చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన..



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన బోధనతో పాటు పౌష్టికాహారం అందించాలని ఎంఈఓలు ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి, ఈపు విజయ్‌కుమార్ ఆదేశించారు. జరజాపుపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌డీ కార్యకర్తల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో గురువారం వారు మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు బోధించాలన్నారు. నేర్చుకున్న ప్రతి అంశాన్నీ చిన్నారులకు నేర్పించాలని కోరారు. ఏసీడీపీఓ తవిటినాయుడు శిక్షణను పర్యవేక్షించారు.

– నెల్లిమర్ల

కళాకారులకు సత్కారం..



కొత్తపేట ఆర్యసోమయాజుల కాశీపతిరాజు స్మారక భవనంలో ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరగనున్న 67వ సంగీత వార్షికోత్సవం గురువారం ప్రారంభమైంది. అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, ఉమెన్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ లలిత కుమారి, కోశాధికారి ధన్వాడ సుధాకర్, భాగవతుల వంశీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ వీణా విద్వాంసులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అయ్యగారి శ్యామసుందరం, జయలక్ష్మి వీణాకచేరి అందరినీ అలరించింది. అనంతరం విద్వాంసులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ కేఏవీఎల్ఎన్.శాస్త్రి, పూర్వ ప్రిన్సిపాల్ బురిడి అనురాధ పరశురామ్, డాక్టర్ కేఏ పద్మప్రియ, డాక్టర్ నగేష్, యామిజాల సన్యాసిరావు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ సందీప్ కపిల్యార్, తదితరులు

- టీబీ ముక్త్ భారత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ కపిల్యార్

విజయనగరం ఫోర్ట్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీబీ ముక్త్ భారత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ కపిల్యార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ విభాగాలు, ఎక్సరే, స్కానింగ్, బ్లడ్ బ్యాంక్, లేబరేటరీ, ఫార్మసీ, వార్డులు, ఐసీయూ, క్యాజువాలిటీ, తదితర విభాగాలను తనిఖీ చేశారు.

చికిత్స పొందే రోగులతో పాటు వైద్య సిబ్బంది కూడా మాస్కులు ధరించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం క్షయ నివారణ కేంద్రాన్ని పరిశీలించారు. రోజుకి ఎంతమంది రోగులు వస్తున్నారు.. ఏఏ లక్షణాలతో వస్తున్నారని ఆరా తీశారు. కార్యక్రమంలో టీబీ కన్సల్టెంట్ డాక్టర్ నీరద, మైక్రో బయాలజీ కె.సందీప్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ పార్వతి, నర్సింగ్ సూపరింటెండెంట్ అమ్మన్న, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.